క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె: స్థానిక టీఎస్ వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో 2025–26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, డ్రాఫ్టమెన్ సివిల్, ఫిట్టర్ ట్రేడ్‌లలో చేరవచ్చునన్నారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని లేదా ఐటీఐ కార్యాలయంలో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మే 24వతేదీ సాయంత్రం 5గంటలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు పబ్లిక్ హెల్త్, మెడికల్ ఎంప్లాయిూస్ కమిటీ ఎన్నిక

కలికిరి: స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో వాయల్పాడు తాలూకా పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిూస్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక గురువారం నిర్వహించనున్నట్లు ఆ సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమానికి తాలుకా పరిధిలోని వైద్య ఆరోగ్య ఉద్యోగులు హాజరుకావాలని కోరారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

కేవీపల్లె : మండలంలోని ఎంపీపల్లె పంచాయతీ బసిరెడ్డిగారిపల్లెకు చెందిన నాయకుడు ముసలి పాపిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నల్లారి తిమ్మారెడ్డి బుధవారం బసిరెడ్డిగారిపల్లెకు చేరుకుని పాపిరెడ్డి మృతదేహానికి పూలమాలతో నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు నల్లారి శ్రీఖర్‌రెడ్డి, సర్పంచ్ రత్నాకర్‌రెడ్డి, నాయకులు మద్దిరాళ్ల మల్లికార్జున, ముసలి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పక్కాగృహాల కోసం దరఖాస్తులు

పెద్దమండ్యం: మండలంలో అర్హులైన వారు పక్కాగృహాల కోసం గ్రామ సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అర్హులైన వారు గ్రామ సచివాలయాలలో తమ ఆధార్, రేషన్ కార్డులను తీసుకెళ్లి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇప్పటివరకు గృహ నిర్మాణశాఖ ద్వారా ఇల్లు మంజూరు కాని వారు అర్హులని తెలిపారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని మద్దయ్యగారిపల్లిలో కవిత అనే మహిళకు మంజూరైన రూ.1.39 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఆయన బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్, సీనియర్ నాయకులు గోపాల్‌రెడ్డి, మల్లెం శివయ్య, కార్యం శంకర్, వెంకటనారాయణ, సుబ్బమ్మ, భాస్కర్‌రెడ్డి, రమణ, ప్రభాకర్, శ్రీరాములుతో సమీక్షించారు. ఈ సందర్భంగా సాయి లోకేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు క్షుణంగా వివరించాలని, క్షేత్ర స్థాయి నుంచి పార్టీ బలోపేతం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలని సూచించారు.

ప్రశాంతంగా పాలిసెట్ పరీక్షలు

మదనపల్లె సిటీ: మదనపల్లెలో బుధవారం పాలిసెట్–25 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్దనున్న జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీలో 824 మందిగాను 731 మంది హాజరయ్యారు. ప్రశాంత్‌నగర్‌లోని జ్ఞానోదయ ఉన్నత పాఠశాలలో 600 మందిగాను 541 మంది హాజరయ్యారు. ఉదయం 11 నుంచి 1 గంట వరకు పరీక్ష జరిగింది. హాల్‌టిక్కెట్లు పరిశీలించి పరీక్షా కేంద్రంలోకి పంపారు. పరీక్షా కేంద్రాలను జీఆర్ఆర్ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్, కో ఆర్డినేటర్ కె.ఓబులేసు, పర్యవేక్షకులు డాక్టర్ పి.భక్త వత్సలం, రూట్ అధికారి శ్రీనివాసులురెడ్డి తనిఖీలు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైభవంగా కలశ స్థాపన


పీఠాధీశ్వరులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు, గ్రామస్థులు

పెద్దమండ్యం: మండలంలోని పాపేపల్లెలో కుషావతీ నది ఒడ్డున వెలసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయ రాజగోపుర, శిఖర కలశ కుంభాభిషేక కార్యక్రమం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో వేదపండితులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. రాజగోపుర, శిఖర కలశ స్థాపన శంకరాచార్య పుష్పగిరి పీఠాధీశ్వరులు విద్యాశంకరభారతి మహాస్వామి వారి దివ్య కరకములచే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద పీఠాధీశ్వరులు విద్యాశంకరభారతి స్వామి వారికి అర్చకులు, వేదపండితులు, గ్రామస్థులు స్వాగతం పలికారు. రాజగోపుర, కలశ కుంబాభిషేక కార్యక్రమం సందర్భంగా తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే కలిచెర్ల ప్రభాకరరెడ్డి సతీమణి ఇందిరమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు.

చట్టాలపై అవగాహన అవసరం

- సబ్ కలెక్టర్ మేఘస్వరూప్
- పనసమాకులపల్లెలో సివిల్ రైట్స్ డే


మదనపల్లె : మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, డీఎస్పీ మహేంద్ర అన్నారు. మండలంలోని పొన్నూటిపాళెం పంచాయతీ పనసమాకులపల్లెలో తహసీల్దార్ ధనంజయులు అధ్యక్షతన సివిల్‌రైట్స్‌డే సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సబ్ కలెక్టర్, డీఎస్పీలు మాట్లాడుతూ...సమాజంలోని పౌరులందరూ తమ హక్కులను పొందాలన్నారు. ప్రతి పౌరుడు తమ హక్కులను వినియోగించుకోవడంతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. నిమ్నజాతుల వారిని కించపరిస్తే చట్టప్రకారం శిక్ష పడుతుందన్నారు. అంటరానితనాన్ని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఎక్కడైనా పౌరహక్కులకు భంగం వాటిల్లితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివక్ష లేకుండా ప్రజలందరూ కలిసి మెలిసి జీవించాలన్నారు. రాజ్యాంగ ఫలాలు అందరికీ సమానంగా అందాలని, చట్టం దృష్టిలో అందరూ సమానమేనన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటాక కూడా రాజ్యాంగ లక్ష్యాలను అందుకోలేకపోతుండటం బాధాకరమన్నారు. మారుమూల గ్రామాల్లో నేటికీ భేదభావాలు, అంటరానితనం, వివక్ష కనిపించడం శోచనీయమన్నారు. కుల,మత,వర్గ విభేదాలు లేకుండా అన్ని వర్గాల ప్రజలు స్నేహభావంతో ఉండాలని కోరారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్.బీఆర్. అంబేడ్కర్..రాజ్యాంగంలో ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీకి సంబంధించి చట్టాలను రూపొందించి పవర్‌ఫుల్ సెక్షన్లు అమలయ్యేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు విచారణకు అధికారిగా డీఎస్పీ ఉంటారని, 90 రోజుల్లోపు కేసు పరిష్కరించేందుకు చట్టపరంగా అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అయితే ఈ కేసుల్లో కొన్ని తప్పుడు ఫిర్యాదులు వస్తున్నాయని, చట్టం దుర్వినియోగం కాకుండా చూడాలన్నారు. రాజ్యాంగం, చట్టానికంటే ఎవ్వరూ అతీతులు కారని, ఉల్లంఘిస్తే కఠినచర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా భేదభావాలు, సమస్యలు ఉంటే తమ దృష్టికి తెస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, తాలూకా సీఐ కళావెంకటరమణ, బాస్ ముత్యాలమోహన్, ఆర్ఐ భరత్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ రైట్స్ డే లో అధికారులను నిలదీసిన దళిత నాయకులు


నిమ్మనపల్లె : దళితుల సమస్యలు పరిష్కరించలేని మొక్కుబడి సమావేశాలు ఎందుకని దళిత సంఘాల నాయకులు అధికారులను ప్రశ్నించారు. మండలంలోని తవళం పంచాయతీ ఎగువ పల్లెలో బుధవారం సివిల్ రైట్స్ డే సమావేశాన్ని దళిత సంఘాల నాయకులతో కలిసి తహసీల్దార్ అమర్నాథ్ నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు గతంలో నిర్వహించిన సమావేశాల్లో గుర్తించిన సమస్యలను ఎందుకు పరిష్కరించలేదంటూ అధికారులను నిలదీశారు. దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ... గతంలో నిర్వహించిన సివిల్ రైట్స్ డే సమావేశంలో అధికారుల దృష్టికి తెచ్చిన సమస్యలను ఇప్పటివరకు పరిష్కరించలేదన్నారు. మొక్కుబడి సమావేశాలను నిర్వహిస్తే ప్రయోజనం లేదన్నారు. ఇటీవల ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మండలానికి కేవలం 9 యూనిట్లను మాత్రమే కేటాయించారని, అవి కూడా ప్రజలకు ఉపయోగంగా లేవన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా కనీసం 30 యూనిట్లను మండలానికి కేటాయించాలని, వయోపరిమితి 60 సంవత్సరాల వరకు పెంచాలన్నారు. సివిల్ రైట్స్ డే సమావేశానికి విద్యుత్ శాఖ మండల అధికారి హాజరు కాకపోతే సమస్యలు ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. సివిల్ రైట్స్ డే సమావేశానికి మండల అధికారులు హాజరు కాకుండా, క్రింది స్థాయి సిబ్బందిని పంపించడం ఏంటని ప్రశ్నించారు. ఎగువపల్లెలో మురుగునీటి కాలువలు, విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారుల దష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మునిరత్నం, సహదేవ, మాణిక్యం, ఏవో రమేష్ బాబు,ఎంఈఓ నారాయణ, ఏపీఓ రమేష్, ఏపిఎం మురళి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మిథున్ చక్రవర్తి, హౌసింగ్ ఏఈ అమర్నాథ్, రీ సర్వే డీటీ సిరాజుద్దీన్, మండల సర్వేయర్ గోపీనాథ్, పంచాయతీ కార్యదర్శి గౌతమి, పాల్గొన్నారు.

దళిత గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తాం

పీలేరు : మండలంలో దళిత గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని బాలంవారిపల్లె పంచాయతీ మొరవ హరిజనవాడలో పౌర హక్కుల దినోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ గ్రామానికి స్మశాన స్థలం, రోడ్డు నుంచి మొరవపల్లెకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. నాలేవాండ్లపల్లె నుంచి మొరవపల్లెకు దారి సౌకర్యం కల్పించాలన్నారు. గ్రామంలో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. పలు భూ సమస్యలు అధికారుల దృష్టికి తెచ్చారు. స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ తమ పరిధిలో సమస్యలు సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివశంకర్, హౌసింగ్ డీఈ రమణయ్య, ఎంఈవో లోకేశ్వర్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్, ఏపీవో అశోక్‌రెడ్డి, ఏవో రమాదేవి, దళిత సంఘాల నాయకులు, గట్టప్ప, నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల నుంచి శ్మశానాన్ని కాపాడండి

– సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, గ్రామస్తులు

మదనపల్లె : శ్మశాన స్థలాలు కాపాడాలని, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం వేంపల్లి గ్రామ పరిధిలోని కన్నెమడుగువారిపల్లి, దిగువ కొనకుంట్లవారిపల్లి, ఎగువ కొనకుంట్లవారిపల్లి గ్రామాలకు చెందిన ప్రజలు,... గ్రామంలోని శ్మశాన భూమిని కబ్జా చేయడాన్ని నిరసిస్తూ తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి తాము మేటిగడ్డ కాలువ నందు శ్మశానాన్ని ఏర్పాటు చేసుకొని చనిపోయిన వారిని అక్కడే సమాధి చేసుకుంటున్నామన్నారు. అయితే ఇటీవల కొంతమంది రియల్టర్లు శ్మశానానికి అనుకున్న ప్రైవేటు భూమిని కొనుగోలు చేసి ప్రభుత్వ స్థలంతో పాటు శ్మశానస్థలాన్ని ఆక్రమించుకున్నారన్నారు. రియల్టర్లు ప్రభుత్వ స్థలాలు, శ్మశానవాటికలు ఆక్రమించుకుంటున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సర్వే చేసి ప్రభుత్వ స్థలాలను శ్మశానవాటికలను రక్షించాలని కోరారు. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ బాబ్జి కి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఐటీయూసీ నాయకులు కృష్ణమూర్తి, గ్రామస్తులు రెడ్డప్ప, రాజన్న, రామ్మూర్తి, చంద్రశేఖర్, రవి, నారాయణ, నరసింహులు, సుధాకర్, నందినీ, లక్ష్మీదేవి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

రామసముద్రం: మండలంలోని మినికి గ్రామానికి చెందిన రెడ్డివారి ఆనంద్‌రెడ్డి అక్రమంగా ఆంధ్ర మద్యం విక్రయిస్తుండగా అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రవికుమార్ బుధవారం తెలిపారు. ఆనంద్‌రెడ్డి మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు తనిఖీ చేయగా ఇంటిలో 48 మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించామన్నారు. దాని విలువ రూ.4,752 లు ఉన్నట్లు తెలిపారు. ఆనంద్‌రెడ్డిని అరెస్ట్ చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌బి కానిస్టేబుల్ గంగిరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ


నితీష్

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం సిద్దమ్మగారి పల్లెకు చెందిన కాలవపల్లి నితీష్ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. చెన్నకేశవులు, సుజాత కుమారుడు నితీష్ దీక్ష పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్నాడు. మహారాష్ట్ర రాష్ట్రం కోలాపూర్‌లో ఏప్రిల్ 25 నుంచి 29వతేదీ వరకు నిర్వహించిన పోటీల్లో రాష్ట్ర స్థాయి తరపున పాల్గొని ప్రతిభ కనబరిచాడు. నితీష్‌ను పాఠశాల ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

ఆర్ఓబీ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

ఆర్డీఓ ఎ. శ్రీనివాస్


మాట్లాడుతున్న ఆర్డీఓ ఎ. శ్రీనివాస్

పీలేరు : పట్టణంలో రెండు ఆర్‌వోబీల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని రాయచోటి ఆర్డీఓ ఎ. శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, ఎన్‌హెచ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఆర్ఓబీ నిర్మాణాల జాప్యంతో పీలేరు ప్రజలకు, ప్రయాణికులకు, వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే జీఓ నెంబరు 30ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇప్పటి వరకు రాయచోటిలో 257, పీలేరులో 73 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. పీలేరులో 4 లే అవుట్లలో విచారణ చేపట్టామని, అందులో 8468 ఇళ్లకు గానూ 5381 మంది లబ్ధిదారులు అర్హత కలిగి ఉన్నారన్నారు. మిగిలినవి 3066 అనర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. 3012 ఇళ్ల నిర్మాణాలు ఇంకా ప్రారంభించలేదని తెలిపారు. రెండో విడత భూ రీసర్వే మండలంలో త్వరలో చేపడుతామన్నారు. జిల్లాలో పొజిషన్ సర్టిఫికెట్‌కు 3600 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు, డీటీ ప్రసాద్, ఎన్‌హెచ్ డీఈ సత్యమూర్తి, సర్వేయర్ కీర్తన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బసవేశ్వరస్వామి జయంతి

రామసముద్రం: రామసముద్రం మండలం ఊలపాడు పంచాయతీలోని గంపనపల్లి గ్రామంలో బుధవారం జగద్గురు బసవేశ్వరస్వామి 891వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పూజ కార్యక్రమం, తీర్థప్రసాదాలు , అన్నదానాలు, భక్తిపాటలు , భజనలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వీరశైవలింగాయత్ జంగమ మండల అధ్యక్షుడు కుమారప్ప, కోశాధికారి సుజ్ఞానమూర్తి, సెక్రటరీ బసవరాజు, బీసీ సెల్ అధ్యక్షుడు రెడ్డివీరేగౌడు, నాగరాజా, కిరణ్, మరినంజేగౌడు, చంద్రశేఖర్, లోకేష్, సి.రెడ్డెప్ప, మేఘన , పార్వతి తదితరులు పాల్గొన్నారు.

కండక్టర్ల సేవలు ఆదర్శనీయం


పదవీ విరమణ చేసిన కండక్టర్ల దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

పీలేరురూరల్ : పదవీ విరమణ పొందిన ఆర్టీసీ కండక్టర్ల సేవలు ఆదర్శనీయమని డిపో మేనేజర్ బి.నిర్మల అన్నారు. బుధవారం స్థానిక డిపో కార్యాలయం వద్ద కండక్టర్లు కె.ఎస్. మణ్యం, ఎన్.ఎస్. చంద్రలకు పదవీ విరమణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీలేరు డిపోలో సుదీర్ఘంగా 33 సంవత్సరాలు పని చేసి డిపో అభివృద్ధికి సేవలందించడం అభినందనీయమన్నారు. వారి శేష జీవితం ఆయురారోగ్యంతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం ఎన్ఎంయూ నాయకులు ఇరువురి దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీఐ సుబ్బమ్మ, గ్యారేజ్ ఎంఎఫ్ హరినాథరెడ్డి, ఎన్ఎంయూ గౌరవాధ్యక్షులు వై. రెడ్డెప్పరెడ్డి, జిల్లా కార్యదర్శి పి.ఎస్.ఎం. రాజు, సి.వి. రమణ, బి.ఆర్.బి. నాయక్, కె.కె. నాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శుద్ధినీటిని సద్వినియోగం చేసుకోండి

కలకడ : పంచాయతీ వారి నుంచి అందించే మినిరల్ వాటర్(శుద్ధినీటిని) గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కలకడ సర్పంచ్ ప్యారీజాన్, ఎంపీడీఓ అబ్దుల్‌రహీం కోరారు. బుధవారం కలకడ వారపు సంతలో మరమ్మతుకు గురైన రక్షిత మంచి నీటి పథకం ఆర్ఓ ప్లాంట్‌ను వేసవిని దృష్టిలో పెట్టుకుని మరమ్మతు చేయించారు. వేసవికాలంలో మంచినీటిని వృథాచేయరాదని, ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కోరారు. మంచినీరు కలుషితం కాకుండా చూడాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. మండల కోఆప్షన్‌సభ్యులు ఇనాయతుల్లా, వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ కార్యదర్శి షావత్‌అల్లీఖాన్, పంచాయతీ కార్యదర్శి దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికడదాం


కిశోరివికాసం అవగాహన కార్యక్రమంలో అధికారులు


కేవీపల్లె : సమష్టి కృషితో బాల్య వివాహాలు అరికడదామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు భారతి, అన్నపూర్ణ, శంకరమ్మ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కిశోరి వికాసం కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు 12 విభాగాలుగా కిశోరివికాసం కార్యక్రమం గ్రామ స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలికల సమష్టి పరిచయం, రుతుక్రమ పరిశుభ్రత, బాల్య వివాహనాలు, పునరుత్పత్తి, ఆరోగ్యము, బాలల హక్కులు, బాలల రక్షణ, ఫోక్సో చట్టం, కౌమార దశలో ఐరన్ లోపం, లింగ అసమానత, విద్య కెరీర్ మార్గదర్శకత్వం, సాధికారిత, శారీరక వ్యాయామం, క్రీడలు లాంటి అంశాలపై అవగాహన కల్పించి చైతన్యపరచనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఎం అనురాధ, సీహెచ్‌వో భాగ్యలక్ష్మీ, హెల్త్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చెరువు మొర ఆక్రమణను తొలగించండి

కలకడ : చెరువు మొర ఆక్రమించి పశువులకు మేత, నీరు లేకుండ పోతాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ గరడప్పగారిపల్లె వద్ద ఉన్న నాగిశెట్టికుంట మొరవను అదే గ్రామానికి చెందిన ఇంజేటి.రామచంద్రారెడ్డి కుమారుడు రెడ్డిక్రిష్ణయ్య ఆక్రమించారని గ్రామస్తులు బుధవారం కలకడ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

నిష్పక్షపాతంగా వార్డుల్లో అభివృద్ధి పనులు

- మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి
- పహల్గాం ఉగ్రదాడి హేయమైన చర్య
- మృతులకు మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల నివాళి


పహల్గాం ఉగ్రదాడి మృతులకు నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు (ఇన్‌సెట్‌లో) మనూజారెడ్డి

మదనపల్లె : పట్టణంలోని 35వార్డుల్లో ప్రజావసరాలకు అనుగుణంగా, నిష్పక్షపాతంగా అభివృద్ధి పనులు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ మనూజారెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ ప్రత్యేక, అత్యవసర సమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభానికి ముందు మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకాచలపతి...పహల్గాం ఉగ్రదాడి హేయమైన చర్యగా పేర్కొంటూ మృతుల కుటుంబాలకు సంతాపసూచకంగా రెండు నిమిషాల సేపు మౌనం పాటిద్దామని కోరారు. కౌన్సిల్ సభ్యులు లేచి పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల ఆత్మకు శాంతి కలగాలని నివాళులు అర్పించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి మాట్లాడుతూ...పహల్గాం ఉగ్రవాదుల దాడి హేయమని, అది దేశసమగ్రతపైనే దాడిగా పేర్కొన్నారు. దేశంలో మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉగ్రవాదాన్ని అణచివేసేందుకు కేంద్రప్రభుత్వం తీసుకునే చర్యలకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. గత సమావేశంలోని అజెండాలో వాటర్, శానిటేషన్‌కు సంబంధించిన అత్యవసర అంశాలను ర్యాటిఫికేషన్ పద్ధతిలో ఆమోదించడం జరిగిందన్నారు. హిందూ శ్మశానవాటికలో అభివృద్ధి పనులకు సంబంధించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. 32,27 వార్డు కౌన్సిలర్లు ఎం.నాగార్జునబాబు(గాంధీ), ఎస్.కరీముల్లాలు మాట్లాడుతూ..35వార్డుల్లో కేవలం 12 వార్డుల్లో మాత్రమే అభివృద్ధి పనులు ప్రతిపాదించారని, ఇందులో భాగంగానే గత అజెండా రద్దు పరచాలని కోరారు. దీనిపై చైర్‌పర్సన్ సమాధానమిస్తూ...అన్ని వార్డుల్లో ప్రాధాన్యత క్రమంలో, ప్రజల అత్యవసర స్థితిని దృష్టిలో ఉంచుకుని అభివృద్ధిపనులు జరుగుతున్నాయన్నారు. 6వవార్డు కౌన్సిలర్ ప్రసాద్‌బాబు మాట్లాడుతూ...గత సమావేశంలో అన్ని వర్గాలకు న్యాయం జరగలేదని అజెండాను రద్దు చేయాలని కోరామని, ఈ అజెండాలో ప్రజలకు అవసరమైన అంశాలను మాత్రమే ఆమోదించి మిగిలిన వాటిని రద్దుచేయాలని కౌన్సిలర్లు ఏకగ్రీవంగా తీర్మానించుకున్నట్లు తెలిపారు. తమందరి తరపున 16వవార్డు కౌన్సిలర్ పెరవలి రాజేష్...అజెండాలోని అంశాల్లో ఏవి ఆమోదమో, తిరస్కారమో తెలుపుతారన్నారు. కౌన్సిల్ ప్రత్యేక, అత్యవసర సమావేశంలోని రెండు అజెండాల్లో 4 అంశాలు మినహా మిగిలిన అన్ని అంశాలకు ఆమోదం తెలుపుతున్నామని కౌన్సిలర్ రాజేష్ ప్రకటించారు. దీంతో టీడీపీ కౌన్సిలర్ తులసీరామకృష్ణ, మార్పూరి నాగార్జునబాబు(గాంధీ), ఎస్.కరీముల్లా మినహా మిగిలిన సభ్యులందరూ చేతులెత్తి ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శ్రావణి, మేనేజర్ రాంబాబు, టీపీఓ జకీరా, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.

అడవి జంతువులను వేటాడటం చట్టరీత్యా నేరం


సంగసముద్రంలో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

గుర్రంకొండ: అడవి జంతువులను వేటాడటం చట్టరీత్యా నేరమని మదనపల్లె అటవీశాఖసెక్షన్ అధికారి సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలోని సంగసముద్రం, మామిళ్లవారిపల్లె,యల్లంపల్లె, సుంకరవాండ్లపల్లె గ్రామాల్లో ప్రజలకు అవగాహనా సదస్సులు నిర్వహించారు.ఈసందర్భంగా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ కొండలు, గుట్టలు కింది భాగన, పరిసరాల్లో ఉన్న గ్రామాల్లో అడవి జంతవుల వేట సాగుతోందన్నారు. అడవి జంతువులను వేటాడడం చట్టరీత్యా నేరమన్నారు. కొంతమంది వేటగాళ్లు విద్యుత్ తీగెలు, ఉచ్చులుపన్ని అడవిజంతువులను వేటాడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వారిపై ప్రత్యేక నిఘా ఉంచి చట్టరీత్యా కేసులు నమోదు చేస్తామన్నారు. వేసవి ఎండలకు తాళలేక తాగునీటి కోసం పొలాల వైపు వచ్చే అడవిజంతువులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు రామ్మోహన్, చంద్ర, మల్లికార్జునలు పాల్గొన్నారు.

అడవి జంతువులను చంపితే కేసులు

కలకడ : పంటలకు నష్టం కలిగిస్తున్నాయని రైతులు అడవి జంతువులైన పందులు, దుప్పిలు, జింకలు, ఏనుగులు, నెమళ్లు, పక్షులను చంపితే చట్టపరమైన కేసులు తప్పవని మదనపల్లె డివిజన్ ఫారెస్ట్ సెక్షన్ అధికారి సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలోని నడిమిచెర్ల, కోన, గుడిబండ గ్రామాలలో ఫారెస్ట్ బీట్ అధికారి చంద్రయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు, రైతులతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రసంగించారు. రైతులు పండించిన పంటలకు అడవి జంతువులు నష్టం కలిగిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. పంటల రక్షణ కోసం పాతపద్ధతిలో ఎత్తుగా ముళ్ళకంచె ఏర్పాటు చేసుకోవాలని, తీగలు బెదుర్లు వంటివి వినియోగించుకోవాలి తప్ప వాటిని చంపడానికి ప్రయత్నించవద్దన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం


సీటీఎం సర్పంచ్ ఆనందపార్థసారథి ఇంట నూతన వధూవరులతో ఎంపీ మిథున్‌రెడ్డి

మదనపల్లె : వైఎస్సార్ సీపీ లోక్‌సభపక్షనేత, రాజంపేట ఎంపీ పీ.వి.మిథున్‌రెడ్డి బుధవారం సీటీఎం సర్పంచ్ ఆనందపార్థసారథి నూతన గృహ ప్రవేశ వేడుకలకు హాజరయ్యారు. మదనపల్లె నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్ కుమార్‌రెడ్డితో కలిసి, సర్పంచ్ ఆనందపార్థసారథి ఇంటికి వెళ్లిన ఆయన...నూతన వధూవరులు రూపేష్ దేవరాయులు, కే.పూజితలను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు బాబ్‌జాన్, ఏపీఎండీసీ మాజీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్ చైర్మన్ జింకాచలపతి, నాయకులు ఎస్.ఏ.కరీముల్లా, గుండ్లూరురఫీ, కౌన్సిలర్లు బి.ఏ.ఖాజా, సింధలూరి రజని, సుగుణ, పి.రాజేష్, సర్పంచ్‌లు బుడ్డయ్య, ఈశ్వరయ్య, శీలంరమేష్, మునిశేఖర్, కొత్తపల్లె మహేష్, ముజీబ్ పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన మండల నేతలు

కలికిరి: మదనపల్లెకు విచ్చేసిన రాజంపేట ఎంపీ పీవీ మిథున్ రెడ్డిని బుధవారం కలికిరి మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ బీసీ, మైనారిటీ నేతలు, కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలో పార్టీ పరిస్థితులపై ఎంపీ విచారించినట్లు వారు తెలిపారు. జంగం సంఘం రాష్ట్ర నాయకుడు మద్దిరాళ్ళ మల్లికార్జున, నర్సరీ వెంకటపతి, బావాజీ, ఖాదర్ వల్లి, ఫయాజ్, సైదుల్లా ఎంపీని కలిశారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



మాట్లాడుతున్న మోటివేటర్ స్పీకర్ ఎన్ఎస్‌రెడ్డి

మదనపల్లె సిటీ: వ్యక్తిత్వ వికాసం ద్వారా విద్యార్థులో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ప్రముఖ మోటివేటర్ స్పీకర్ ఎన్ఎస్ రెడ్డి అన్నారు. స్థానిక చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో బుధవారం కమ్యూనికేషన్ స్కిల్స్,వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కమ్యూనికేషన్ నైపుణ్యాలు మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసం కూడా ప్రతి విద్యార్థి జీవన ప్రయాణంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. కమ్యూనికేషన్ ఉండటం వల్ల అవకాశాలు ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్. రామలింగారెడ్డి మాట్లాడుతూ కెరియర్ అభివృద్ధిలో కమ్యూనికేషన్ నైపుణ్యాల ప్రాధాన్యత తెలియజేశారు. విద్యార్థులు తమ అభ్యున్నతి సాధించాలంటే ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, అధ్యాపకులు అమరనాథరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, అరుణ్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవత సంస్థకు విద్యార్థుల విరాళం

కలకడ : మండల మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు కె.బాటవారిపల్లె పాఠశాల విద్యార్థులు రూ.2,116 విరాళం అందజేశారు. బుధవారం స్థానిక పాఠశాలలో పెద్దలు ఇచ్చిన నగదును పొదుపు చేసుకున్న విద్యార్థులు ఆ పాఠశాల ఉపాధ్యాయుడు(లెక్కలు) జనార్దన్‌రెడ్డి చూపే సేవా మార్గంలో మండల మానవత సంస్థకు అందజేసి పేదలకు వినియోగించాలని కోరారు. విద్యార్థులలో దాన గుణం, మంచిమార్గం చూపుతున్న ఉపాధ్యాయుడు జనార్దన్‌రెడ్డిని మానవత సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఆ సంస్థ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులురెడ్డి, వైవి రమణ, గంగాద్రినాయుడు, జనార్దన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలలో 41 మంది ఎంపిక


జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులు

పీలేరు రూరల్ : స్థానిక ఎస్‌జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, సీడ్ ఆఫ్ అండ్ డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ ఆఫీస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 41 మంది ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. జాబ్‌మేళాలలో టాటా క్యాపిటల్, టాటా ఐయా, ముత్తూట్ ఫైనాన్స్, డైకిన్, టైచీకాస్ట్ టెక్, హీరోమోటార్ కార్ప్, ఫాక్స్‌కాన్ మొత్తం 8 కంపెనీలు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. 110 అభ్యర్థులు హాజరు కాగా 41 మందిని సెలెక్ట్ చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ డోనప్ప, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.